


కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో విపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, నన్నపనేని నరేందర్ తదితరులు

# కేసీఆర్ మాటే గుండె ధైర్యం

మొదటిపేజీ తరువాయి...

బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో కలిసి మహాసభ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినవిధంగా బోధించు, సమీకరించు, పోరాడు.. అనే పోరాటతత్వాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకొని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తెలంగాణ సాధించాలనే నినాదంతో 2001 ఏప్రిల్ 27న పురుడుపోసుకున్న సంస్థ టీఆర్‌ఎస్. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ నాయకత్వంలో 24 ఏండ్ల క్రితం ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ ఏర్పడింది. తర్వాత 14 ఏండ్లు తెలంగాణ ప్రజలను ఎక్కడికక్కడ సమీకరిస్తూ, రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను జాతీయ, రాజకీయ వ్యవస్థలకు, దేశంలోని వివిధ సమూహాలకు ఎప్పటికప్పుడు వివరించింది. ప్రతీ సమస్యపై పోరాడింది. బీఆర్‌ఎస్‌కు ఒక విశిష్టత, ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రస్తుతం ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నో రాజకీయ సంస్థలు, ఉద్యమసంస్థలు పుట్టాయి... మాయమైపోయాయి. ఒక ఉద్యమపార్టీగా, అధికార పార్టీగా, ప్రతిపక్ష పార్టీగా ఇన్ని పాత్రల్లో 24 ఏండ్లు పూర్తి చేసుకుని, 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విశిష్టత బీఆర్‌ఎస్‌కు ఉన్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పాటైన బీఆర్‌ఎస్ మాత్రమే అస్థిత్వాన్ని నిలుపుకొన్నాయి. తెలంగాణ అస్థిత్వాన్ని బీఆర్‌ఎస్ హిమాలయాల స్థాయికి తీసుకెళ్లింది' అని కేటీఆర్ వివరించారు.

> తెలంగాణ ప్రజల గుండె ధైర్యం ఈ గులాబీ జెండా. ఏ వర్గం ప్రజలకు ఏ కష్టమొచ్చినా హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వైపే వస్తున్నారు. తెలంగాణభవన్ అన్ని వర్గాల కష్టాలను తీర్చే జనతా గ్యారేజీ మాదిరిగా ఉంటున్నది. హైడ్రా, మూసీ, లగచర్ల బాధితులైనా... ధన దాహానికి, అధికార బలానికి ఇబ్బంది పడిన హెచ్‌సీయూ విద్యార్థులైనా.. ఈ గులాబీ జెండా మాత్రమే తెలంగాణకు న్యాయం చేస్తదన్న నమ్మకంతో జై కొడుతున్న పరిస్థితి ఉన్నది.
>
> - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### చరిత్రలో నిలిచిపోయేలా ఎల్కతుర్తి మహాసభ

ఎల్కతుర్తిలో జరగబోతున్న సభ ఆషామాషీ సభ కాదని, దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే మహాసభగా నిలుస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. 'తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచీ గులాబీ జెండాకు ఉమ్మడి వరంగల్ జిల్లా అండగా ఉన్నది. ఉద్యమ ప్రస్థానంలో ఏ కష్టమొచ్చినా, ఏ ఇబ్బంది వచ్చినా కేసీఆర్ తిరిగి చూసింది వరంగల్ వైపే.



ఎల్కతుర్తి రజతోత్సవ సభాప్రాంగణం వద్ద మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బండా ప్రకాశ్, మధుసూదనాచారి, రెడ్యానాయక్

జయప్రదంగా, అద్భుతంగా ఇక్కడ ఎన్నో మహాసభలను నిర్వహించుకున్నాం. బీఆర్‌ఎస్‌కు 24 ఏండ్లు నిండి 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న రజతోత్సవానికి వరంగల్ వేదిక కావడం మనందరికీ గర్వకారణం. ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యకర్తలు, నాయకులు, అందరి కోరిక మేరకు మరో మహాసభకు వరంగల్‌ను వేదికగా ఎంచుకున్నాం. 1,250 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్, సభా ప్రాంగణం ఉంటుంది. రాష్ట్రంలోని ఏ మూలనుంచైనా వచ్చే ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహాసభ ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రతీ నియోజకవర్గం నుంచి, ప్రతీ జిల్లా నుంచి.. ఇంకా ఎక్కువ వాహనాలు ఏర్పాటుచేయాలని, కేసీఆర్ మాట వినాలని, ఆయన మాట వింటే ధైర్యం వస్తుందని ప్రజలు చెప్తున్నారు. కేసీఆర్ మాట వింటే కాంగ్రెస్ అరాచక పాలనను అంతం చేయడానికి.. బాధితులందరికీ గుండె నిండా మరోసారి ఉత్సాహం వస్తదని అంటున్నారు. మేమొస్తమంటే మేమొస్తమంటూ ప్రతి నియోజకవర్గం నుంచి ఒత్తిడి వస్తున్నది' అని కేటీఆర్ వివరించారు.

### ఏ వాహనం దొరికితే ఆ వాహనంలో వచ్చేయండి

'ఉమ్మడి వరంగల్, పక్కనే ఉన్న కరీంనగర్ జిల్లా మిత్రులు ఎవరికివారు ఏ వాహనం అందుబాటులో ఉంటే ఆ వాహనంలో వచ్చేయండి. హుస్నాబాద్, హుజూరాబాద్ వాళ్లు మోటర్‌సైకిళ్లపై వచ్చేందుకు ఎవరికి వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ వాహనం దొరికితే ఆ వాహనంలో రావాలి. 40 వేల వాహనాలు వచ్చినా ఏ ఇబ్బంది లేకుండా పార్కింగ్ సదుపాయం ఉన్నది. చిన్న వాహనాలు, పెద్ద వాహనాలు, బస్సులు, ఆటోలు, జీపులు, కార్లు... ఇలా ఎన్ని వాహనాలు వచ్చినా ఎక్కడో దూరం నుంచి నడిచివచ్చే అవసరం లేకుండా మహాసభ ప్రాంగణం పక్కనే పార్కింగ్ ఏర్పాట్లుచేసిన వరంగల్ ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నాయకత్వానికి ధన్యవాదాలు.

> ఏప్రిల్ 27న మొత్తం రాష్ట్రంలోని 12,796 గ్రామ పంచాయతీలు, అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీ వార్డుల్లో ఎక్కడికక్కడ గులాబీ జెండాలు ఎగురవేసి బయలుదేరాలి. ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు కేసీఆర్ మహాసభ ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సమయం కంటే ముందుగానే ఇక్కడికి చేరుకోవాలి. ఎడ్లబండ్లలో వచ్చే వాళ్లు ట్రాఫిక్‌జాం చేయకుండా 26న మహాసభ వద్దకు చేరుకోవాలి.
>
> - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

మహాసభ కోసం వచ్చే వారు వాహనాలు దూరంగా పెట్టే అవసరం లేదు. ఏ రోడ్డు నుంచి వచ్చే వాహనాలకు అక్కడే పార్కింగ్ కల్పించారు. సిద్దిపేట నుంచి హుస్నాబాద్ మీదుగా వచ్చే కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల వాహనాలకు 260 ఎకరాల్లో పార్కింగ్ ఉన్నది. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లా నుంచి వచ్చే వాహనాల కోసం 600 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశాం. హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చే వారికీ ఇబ్బంది లేకుండా పార్కింగ్ వసతి ఉన్నది. బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు వచ్చే ఏ ఒక్కరూ కిలోమీటర్ల దూరం నడిచే ఇబ్బంది లేకుండా బ్రహ్మాండంగా పార్కింగ్ స్థలం, సభావేదిక వద్ద ఏర్పాటు చేశాం. ప్రజలందరికీ సౌకర్యంగా ఉండే విధంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ ఉంటుంది. మహాసభకు వచ్చే లక్షలాది మంది కోసం ఎక్కడికక్కడ 10 లక్షల వాటర్ ప్యాకెట్లు, 10 లక్షల సల్ల ప్యాకెట్లు పెడుతున్నాం. మహాసభకు వచ్చినవారికి ఎండదెబ్బ, ఇతర ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్యసాయం అందించేందుకు 100 పైచిలుకు వైద్యబృందాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం. ఎమర్జెన్సీ వైద్యసేవల కోసం 20 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. దూరప్రాంతాల నుంచి వస్తున్న ఆడబిడ్డలు, అన్నదమ్ముల కోసం ఎండాకాలం ఇబ్బందులు లేకుండా చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో తాత్కాలిక టాయిలెట్ల నిర్మాణం కొనసాగుతున్నది' అని కేటీఆర్ వివరించారు.

> ఎల్కతుర్తిలో జరగబోతున్న సభ ఆషామాషీ సభ కాదు. దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే మహాసభగా నిలుస్తుంది. ప్రతి నియోజకవర్గం నుంచి, ప్రతి జిల్లా నుంచి.. ఇంకా ఎక్కువ వాహనాలు ఏర్పాటుచేయాలని రిపోర్టులు పంపుతున్నారు. కేసీఆర్ మాట వినాలని, ఆయన మాట వింటే ధైర్యం వస్తుందని ప్రజలు చెప్తున్నారు.
>
> - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### ఉద్యమం నాటి రోజులు

బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభతో తెలంగాణ సాధన ఉద్యమం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ చెప్పారు. 'ఇదొక ఉత్కృష్ట సందర్భం. పార్టీ చరిత్రలో ఇలాంటివి మళ్లీమళ్లీ రావు. మళ్లీ 50 ఏండ్ల పండుగ.. గోల్డెన్ జూబ్లీ వస్తుంది. రజతోత్సవ మహాసభకు వస్తున్న ప్రజలతో ఈరోజు ఒక దృశ్యం చూస్తే.. చాలా గొప్పగా అనిపించింది. మళ్లీ ఉద్యమం నాటి రోజులు గుర్తుకొచ్చాయి. ఉద్యమ సమయంలో వరంగల్‌లో సభ పెడితే నర్సంపేట, పరకాల నుంచి ప్రభ బండ్లు వచ్చేవి. ఇప్పుడు సూర్యాపేట నుంచి బయలుదేరినయి. 'బండెనక బండి కట్టి..' అని బండి యాదగిరి అప్పుడెప్పుడో పాట రాశారు. ఇవాళ సూర్యాపేట జిల్లా రైతన్నలు ఎడ్లబండ్లతో పెద్ద ఎత్తున బయలుదేరి వస్తున్నారు. ఈరోజు సాయంత్రం తొర్రూరు చేరుకుంటారు. ఉద్యమస్ఫూర్తిని, రైతాంగానికి కేసీఆర్‌పై ఉన్న ప్రేమను చాటుతూ అక్కడినుంచి బయలుదేరి ఇక్కడికి వస్తున్నారు. 60 లక్షల గులాబీ దండు అందరికీ నా ప్రార్థన. మనందరం బయలుదేరి మహాసభకు రావాలి. వర్ధన్నపేట నుంచి 500 ఎడ్ల బండ్లు రాబోతున్నాయని దయాకర్‌రావు చెప్తున్నారు. ఎడ్లబండ్లలో వచ్చే వాళ్లు ట్రాఫిక్‌జాం కాకుండా 26న మహాసభ వద్దకు చేరుకోవాలి. గతంలో వరంగల్‌లో సభలు పెట్టినప్పుడల్లా జనగామ వరకు ట్రాఫిక్‌జామ్ అయ్యేది. ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండా రెండు వేల మంది వలంటీర్లను నియమించుకున్నాం. కెనాల్ బ్రిడ్జిలు, చిన్న కల్వర్టుల వద్ద వలంటీర్లను ప్రత్యేకంగా నియమిస్తాం. ప్రతీ గులాబీ సైనికుడు, కేసీఆర్ దళంలోని ప్రతీ సభ్యుడు, ప్రతీ ఒక్కరూ అందుబాటులో ఉన్న వాహనంలో మహాసభకు చేరుకోవాలి. మన నాయకుడు కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి ఒక కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడానికి, ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను ప్రశ్నించడానికి, అడ్డుకోవడానికి, ఎదుర్కోవడానికి, 11 ఏండ్లుగా బీజేపీ చేస్తున్న పన్నాగాలను, తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై కేసీఆర్ ఇచ్చే సందేశాన్ని గ్రామ గ్రామానికి తిరిగి చేరవేయడానికి అందరూ కదిలి రావాలి. ఏప్రిల్ 27న మొత్తం రాష్ట్రంలోని 12,796 గ్రామ పంచాయతీలు, అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీ వార్డుల్లో ఎక్కడికక్కడ గులాబీ జెండాలు ఎగురవేసి బయలుదేరాలి. ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు కేసీఆర్ మహాసభ ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సమయం కంటే ముందుగానే ఇక్కడికి చేరుకోవాలి. కరోనా టైంలో సైతం కేసీఆర్ సందేశం వినాలని తెలంగాణ ప్రజలకు ఉన్న ఉత్సుకత ఇప్పుడూ ఉన్నది. కేసీఆర్ మాటలు వింటే ధైర్యం వస్తుందనే పరిస్థితి రాష్ట్రమంతా ఉన్నది. బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు ప్రభుత్వ యంత్రాంగం సహకరిస్తున్నది. ఎల్కతుర్తిలో మేం నిర్వహించే సభ గవర్నమెంట్ మీద పోరాటానికో, ప్రజలను రెచ్చగొట్టడానికి చేస్తున్నది కాదు. శాంతియుతంగా, మా పార్టీ 25వ వార్షికోత్సవాన్ని రజతోత్సవంగా జరుపుకుంటున్నాం. ఇప్పటి వరకు ఉన్నట్టుగానే రాబోయే మూడు నాలుగు రోజులు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని జిల్లా యంత్రాంగానికి, పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని కేటీఆర్ చెప్పారు.

> కేసీఆర్ మాట వినాలని.. ఆయన మాట వింటే గుండె నిండా ధైర్యం వస్తదని ప్రజలు చెప్తున్నరు. కేసీఆర్ మాటలు వింటే కాంగ్రెస్ అరాచక పాలన అంతమవుతదనే భరోసా కలుగుతదంటున్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మేమొస్తమంటే మేమొస్తమని ప్రతి నియోజకవర్గం నుంచీ స్వచ్ఛందంగా కదులుతున్నరు. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా.. రాష్ట్రంలో ఏ వర్గం వారికి కష్టమొచ్చినా అందరూ తెలంగాణ భవన్‌వైపే వస్తున్నారు.
>
> - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

> కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కరెంటు ఎప్పుడు ఉంటదో, ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే కరెంట్ మీద మాకు నమ్మకం లేదు. వీళ్లను నమ్ముకుంటే కచ్చితంగా ఏదో రకంగా మోసం చేస్తారని బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహణ కోసం 200 జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నాం.
>
> - కేటీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### అభినందనలు

బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ కోసం 20 రోజులుగా వరంగల్ జిల్లా నాయకులు చాలామంది కష్టపడుతున్నారని కేటీఆర్ అభినందించారు. 'సోదరులు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లు, స్థానిక మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పూర్తిస్థాయిలో నిమ్మగమై ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాజయ్య, సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్, కవిత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్‌రావు అందరూ వారి వారి నియోజకవర్గాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు' అని కేటీఆర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపనేని నరేందర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, నాగుర్ల వెంకటేశ్వర్లు, కే వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పాల్గొన్నారు.

### కశ్మీర్ మృతులకు కేటీఆర్ సంతాపం

జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించినవారికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన కేటీఆర్.. మీడియా సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం వ్యక్తంచేశారు.



మల్కాజిగిరి మున్సిపల్ ఆఫీస్ వద్ద చెట్టు కింద కూర్చొని అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

## చెట్టు కింద కూర్చొని ఎమ్మెల్యే నిరసన

- మల్కాజిగిరిలో క్యాంపు ఆఫీసు కేటాయించని సర్కారు
- చెట్టు కిందనే కుర్చీ వేసుకొని ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 23: మల్కాజిగిరిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేటాయించనందుకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చెట్టు కింద కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ వద్ద ఉన్న చెట్టు కింద కూర్చుని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతోపాటు కనీసం తనకు కనీసం పీఏను కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లలోపు కరెంటు బిల్లులు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం, రేషన్‌కార్డులు, అర్హులైన పేదలకు పెన్షన్లు అందకపోవడం తదితర అంశాలపై పలువురు తనకు ఫిర్యాదు చేశారని తెలిపారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ల విషయంలో దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు లేకపోవడంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, అడిషనల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడం లేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా కూర్చుంటానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతాయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్‌గౌడ్, మురుగేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, జీకే హనుమంతరావు, అమినుద్దీన్, రాముయాదవ్, చిన్నయాదవ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

- రాష్ట్రమంతా 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 44 డిగ్రీల కంటే అధికం
- 10 జిల్లాలకు రెడ్ అలర్ట్, 23 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో నలుగురు మృతి
- మరో 3 రోజులు వడగాలుల ప్రభావం: ఐఎండీ అధికారులు



ఎండతాకిడితో నిర్మానుష్యంగా కనిపిస్తున్న కరీంనగర్ మార్కెట్‌రోడ్‌లోని అమరుల స్తూపం చౌరస్తా

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. ఉపరితల ద్రోణి, బంగాళాఖాతంలో అల్పపీడనంతో గతవారం వాతావరణం కాస్త చల్లగా ఉన్నా సోమవారం నుంచి ఎండ తీవ్రత మొదలైంది. సూర్యుడి భగభగలకు జనం అల్లాడుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలు నిప్పుల కొలిమిగా మారాయి. 10 జిల్లాల్లో 44 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా కుభీర్‌లో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 23 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయట తిరగొద్దని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.

### వడదెబ్బకు నలుగురు మృతి

ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి మంగళవారం నలుగురు మృతి చెందారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన మేడి ఎర్ర ముత్తయ్య(76) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయాడు. పెనుబల్లి మండలం కందిమళ్లవారి

**బుధవారం అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు**

| జిల్లా | ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో) |
|---|---|
| నిర్మల్ | 45.2 |
| ఆదిలాబాద్, నిజామాబాద్ | 44.4 |
| మంచిర్యాల | 44.3 |
| జయశంకర్ భూపాలపల్లి | 44.2 |
| జగిత్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ పెద్దపల్లి, కరీంనగర్ | 44.1 |

బంజర్‌కు చెందిన వంటలమేస్త్రి తుమ్మలపల్లి సత్యనారాయణ(43) వంట చేసేందుకు వెళ్లి వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన మర్రిపెల్లి అర్వింద్ (19) మామిడి తోటకు నీరు పెట్టేందుకు వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్లకు చెందిన పాత భూమయ్య(58) సైకిల్‌పై తిరుగుతూ చింతగింజలు, చింతపండు, ధాన్యం కొనుగోలుతో జీవనం సాగించేవాడు. మంగళవారం సైకిల్‌పై వెళుతూ వడదెబ్బ తగిలి పడిపోయాడు. దవాఖానకు తరలించేలోపే చనిపోయాడని స్థానికులు చెప్పారు.

### మరో మూడురోజులు మంటలే!

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదవుతాయని తెలిపింది. వడగాలుల నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. అస్వస్థతకు గురైతే వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలని తెలిపారు. తరచుగా నీరు, కొబ్బరి నీరు, ఓఆర్‌ఎస్ వంటి ద్రావణాలు తాగడం వల్ల ఒంట్లో నీరు, లవణాలు తగ్గకుండా, నీరసం, అస్వస్థతకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

## లోకం పోకడ




బైబై రేవంత్.. నాణ్యమైన మేడిన్ జపాన్ బుల్డోజర్లు కావాలంటే చెప్పు.. టోకున సరసమైన ధరలకే పంపిస్తా!



ములుగు జిల్లా ఏటూరునాగారంలో రైతు సాంబయ్యతో మాట్లాడుతున్న పోలీసులు

## అప్పులబాధతో రైతు ఆత్మహత్యాయత్నం

**100కు డయల్ చేసిన కుటుంబ సభ్యులు**

**ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు**

**కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగింత**

ఏటూరునాగారం, ఏప్రిల్ 23 : అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు డబ్బాతో ఇంటి నుంచి వెళ్లాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేయడంతో వారు సకాలంలో స్పందించి రైతును పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఏటూరునాగారానికి చెందిన రైతు మాటూరి సాంబయ్య రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. నిరుడు కూడా మిర్చి వేయగా నష్టం వచ్చింది. ఈ సారి కూడా నష్టం రావడంతో సుమారు రూ.2 లక్షలకుపైగా అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. మంగళవారం రాత్రి పురుగు మందు డబ్బా తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం భార్యకు తెలియడంతో వెంటనే 100కు డయల్ చేసింది. పోలీసులు సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ట్రేస్ చేయగా మిర్చి కల్లం వద్ద సాంబయ్య ఉన్నట్టు గుర్తించి వెంటనే అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో సాంబయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. వెంటనే స్పందించి తన భర్తను కాపాడినందుకు సాంబయ్య భార్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.




సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

## గ్రూప్-1పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ అంటే చీటింగ్, కరప్షన్, కలెక్షన్
- టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

ఖైరతాబాద్, ఏప్రిల్ 23: టీజీపీఎస్సీ గ్రూప్-1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గ్రూప్-1 అవకతవకలపై హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు, ఫలితాల వెల్లడిలో జరిగిన అవకతవకలను బయటకు తీయాలని, బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, అన్యాయం జరిగిన నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు బీఆర్‌ఎస్ అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అమలు కాని హామీలిచ్చి నిరుద్యోగులను వాడుకొని వదిలేసిందని ధ్వజమెత్తారు. న్యాయమైన డిమాండ్లు చేసిన నిరుద్యోగులపై ప్రభుత్వం పాశవిక దాడులు చేయించిందని మండిపడ్డారు. 16 నెలల్లో నిరుద్యోగులను పిలిచి మాట్లాడిన దిక్కే లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో నం.55 తీసుకొచ్చిందని, కానీ ఆ వర్గాలన్నింటికీ అన్యాయం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 29 తీసుకువచ్చిందని విమర్శించారు. నేడు నిరుద్యోగులను, విద్యార్థులను లాఠీలతో కొడుతూ అరెస్టులు చేయిస్తుంటే.. నాడు బీఆర్‌ఎస్‌పై బురదజల్లిన మేధావులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. 40 లక్షల నిరుద్యోగులను అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ పెద్దలు క్యాబినెట్‌లో ఉద్యోగాలు సంపాదించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణలో విధ్వంసం జరుగుతుందని, ఓ వైపు హైడ్రా, మరోవైపు మూసీ, లగచర్ల, ఇంకో వైపు హెచ్‌సీయూ భూముల పేరిట దౌర్జన్యకాండ కొనసాగుతుండగా, ప్రశ్నించాల్సిన మేధావులు పదవులకు అమ్ముడుపోయారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అంటే చీటింగ్, కరప్షన్, కలెక్షన్ అని, అలాంటి ఆ పార్టీ నేతలను నిలదీయాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, నర్సింహ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.